

### సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం

గంభీరావుపేట: లింగన్నపేటలోని ఎర్ర చిలుకతండా సేవాలాల్ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. అయోధ్యకు చెందిన గురువు గణేశ్‌దాస్ ఆధ్వర్యంలో హోమం చేశారు.



### మూడోరోజు గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మూడోరోజు గురువారం గంగాహారతి నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరిలో దీపాలు వదిలారు.




### వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ప్రణాళికతో ప్రశాంతంగా ఎన్నికలు



మాట్లాడుతున్న వినిత సాహూ

సిరిసిల్లక్రైం: పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించవచ్చని ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహూ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండస్వామి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమీక్షించారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత తీసుకోవాల్సిన భద్రత చర్యలు, ఈవీఎం, స్ట్రాంగ్‌రూం భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రతీపౌరుడు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా నమ్మకాన్ని కలిగించడంలో పోలీసుల పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. నగదు, మద్యం పంపిణీ, ఉచితాల సరఫరాపై నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల విధులపై జిల్లాలో పోలీస్ అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు రూ.75.50 లక్షల నగదును సీజ్ చేసినట్లు వివరించారు. 582 కేసుల్లో 1503 మందిని బైండోవర్ చేసి ప్రశాంతతకు ఎలాంటి అవరోధాలు రాకుండా చూసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఎక్సైజ్ అధికారి పంచాక్షరి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, రవికుమార్, సీఐలు, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా పనిచేయాలి



వైన్స్‌ను తనిఖీ చేస్తున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/గంభీరావుపేట: ఎన్నికల సమయంలో ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా పనిచేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం వాహనాలు, వైన్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణా, కొనుగోళ్లపై నిఘా ఉంచాలని, వైన్స్‌లోని స్టాక్ రిజిష్టర్లు, మద్యాన్ని పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. మద్యం విషయంలో వచ్చే ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలని ఆదేశించారు. ఈఎస్ పంచాక్షరి, సీఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా సరిహద్దు పెద్దమ్మ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో గురువారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి తనిఖీలు చేశారు.

# రండి.. ఓటేయండి

- పోలింగ్ శాతం పెంచేందుకు ప్రచారాస్త్రం
- జిల్లాలో ఓటర్లకు సమాచార స్లిప్‌ల పంపిణీ
- తక్కువ ఓటింగ్ నమోదైన ప్రాంతాల్లో కళాజాత ప్రదర్శనలు
- ఓటు హక్కుపై ఫ్లెక్సీల ప్రచారం
- ఉద్యోగులకు, అత్యవసర సేవల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్లు



ఓటేద్దాం రండి.. పాటల సీడీ ఆవిష్కరణ

జంగ్ తెలంగాణ

సిరిసిల్ల: జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం ప్రచారాస్త్రాలను వినియోగిస్తోంది. గతంలో తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరిగే విధంగా ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నారు. ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ శాతం పెంచే దిశగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రచారాన్ని చేపట్టింది.

**ఇంటింటికీ ఓటరు స్లిప్‌లు**

జిల్లాలో ఇంటింటికీ ఓటర్ సమాచార స్లిప్‌ల పంపిణీని బూత్ లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా స్లిప్‌లు పంపిణీ చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు. దీంతో ఓటరుకు ఏ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు ఉందో తెలుస్తుంది. జాబితాలో సీరియల్ నంబరు కూడా స్పష్టమవుతుంది. ఓటరు స్లిప్‌తో పాటు సీ-విజిల్ కరపత్రాన్ని కూడా అందజేస్తున్నారు. అలాగే ప్రతీ కుటుంబానికి ఓటరు గైడ్‌ను కూడా పంపిణీ చేస్తున్నారు. సెక్టార్ పరిధిలో ఓటరు స్లిప్‌లు ప్రతీ ఓటరుకు అందేలా సెక్టార్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**ఇంటి నుంచే ఓటు హక్కు**

జిల్లాలో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేస్తున్నారు. 40శాతం, ఆపై వైకల్యం కలిగిన దివ్యాంగులు, 80 ఏళ్లకు పైబడిన ఓటర్లకు తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వే, ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్‌శాఖ, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ), పౌర సరఫరాల శాఖ, బీఎస్ఎన్ఎల్, పోలింగ్ రోజు వార్తల సేకరణ కోసం ఎన్నికల సంఘం నుంచి పాస్ పొందిన జర్నలిస్టులు, అగ్నిమాపక శాఖ అధికారులు బ్యాలెట్ ఓటు వేయవచ్చు.




ఓటు వేస్తానంటూ కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రత్యేక ఏర్పాట్లు**

దివ్యాంగులు సులభంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని 547 పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు వృద్ధులు సులభంగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. ర్యాంపు, వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. ఓటింగ్ నమోదు శాతం పెంచడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి దృష్టిసారించారు.

**కలెక్టరేట్‌లో సెల్ఫీ స్టాండ్**

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌లో 'ఐ విల్ ఓట్' అంటూ సెల్ఫీ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. మేము తప్పకుండా ఓటు వేస్తాము అంటూ సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తున్నారు. జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా అధికారులు ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నారు.

**కళాజాత ప్రదర్శనలు**



కళాకారుల కళాజాత

ఓటింగ్ శాతం తక్కువ నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యం చేసేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కళాజాత ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పల్లెలతో పోల్చుకుంటే పట్టణాల్లోనే ఓటు నమోదు శాతం తక్కువగా ఉన్నందున ప్రధానంగా సిరిసిల్ల, వేములవాడల్లో కళాజాత ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నారు. యువకులను ఓటు వేసేలా చూసేందుకు ట్విట్టర్, ఫేస్ బుక్, వాట్సప్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల్లో ఓటు హక్కు ప్రాధాన్యత వినియోగం గురించి తెలిపేలా ప్రత్యేకంగా వీడియోలు పాటలు రూపొందించి ఓటర్లను చైతన్యం చేస్తున్నారు. ఓటేద్దాం.. రండి! అనే ఆడియో, వీడియో సీడీని ఆవిష్కరించారు. మరోవైపు జిల్లాలోని 255 గ్రామ పంచాయితీలలో ఓటు హక్కు ప్రాధాన్యత తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

## గడువులోగా ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఓటరు సమాచార స్లిప్‌లను గడువులోగా పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్, నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటరు స్లిప్‌ల పంపిణీ ప్రారంభించామని, కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పంపిణీ పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 547 పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటి నుంచే ఓటింగ్‌ను షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించే వేదికల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ర్యాండమైజేషన్, ఈవీఎంల కమిషనింగ్ చేపట్టాలని తెలిపారు. నోడల్ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగిలే చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బొద్దుల గంగయ్య, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## మీ బిడ్డగా ఉంటా.. ఆశీర్వదించండి



నాగారంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్



అడ్వకేట్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ : మీ బిడ్డగా.. మీ ఇంటివాడిగా ఉంటూ మీ సేవలో తరిస్తాను.. ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడకు చెందిన బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిట్టల మనోహర్, అడ్వకేట్లు రజనీకాంత్, నరాల శ్రీనివాస్, భానుకృష్ణ, శ్రీకాంత్, శేఖర్, దాసరి శ్రీనివాస్, రవీందర్, శశి, నాగరాజు, తిరుపతి, వంశీకృష్ణ, ప్రశాంత, సుజాత, వెంకటేశ్‌లు కాంగ్రెస్‌లో చేరగా వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అడ్వకేట్లంతా తమకు మద్దతుగా పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు.

**జన బలమే గెలవాలి**

రుద్రంగి: ఈ ఎన్నికల్లో జన బలమే గెలవాలి కానీ ఎట్టి పరిస్థితుల్లో ధన బలం గెలవ కూడదని, అందుకు ప్రతిఒక్కరూ కాంగ్రెస్ చేతి గుర్తుపై ఓటు వేయడంతో పాటు ప్రలోభాలకు లొంగకుండా ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని ఆది శ్రీనివాస్ కోరారు. రుద్రంగిలోని నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు ఆదికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మాణం చేసి, సంఘానికి ఆహ్వానించి తమ మద్దతు తెలిపారు.

**బొట్టు పెట్టి ఓటు అభ్యర్థన**

వేములవాడ: వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ, తన కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులతో కలిసి ఇంటింటా తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థించారు.

**ఒక్కసారి అవకాశం ఇవ్వండి**

కోనరావుపేట: వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆది శ్రీనివాస్ అన్నారు. నాగారం, మర్తనపేటలో గురువారం రాత్రి ఇంటింటా తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. ఇంతకాలం పట్టణాల్లో ఉన్నవారంతా ఎన్నికలు రాగానే పల్లెల్లోకి వస్తున్నారని, మళ్లీ పట్టణాలకే వెళ్లిపోతారని, తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు.

**అవ్వ కాళ్లు మొక్కుతా**

వేములవాడరూరల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు, సీనియర్లు ఇంటింటికి తిరుగుతున్నారు. ఈసారి ఎలాగైనా గెలిపించాలని పట్టుదలతో ప్రతిఒక్కరూ ఓటర్లను ప్రాధేయపడుతున్నారు. శాత్రాజుపల్లి, నాంపల్లి గ్రామాల్లో ఓటర్ల కాళ్లు మొక్కుతున్నారు. సీనన్నకు ఓటు వేసి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ రుణాన్ని తీర్చుకోవాలని కోరుతున్నారు.

**బీఆర్ఎస్‌ను గద్దె దించాలి**

చందుర్తి: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి, కొత్త మేనిఫెస్టోతో ప్రజల వద్దకు ఓట్ల కోసం వస్తున్న బీఆర్ఎస్ పార్టీని గద్దె దించాలని సీపీఐ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు అన్నారు. గురువారం చందుర్తి మండలం జోగాపూర్, రామరావుపల్లె, ననుగుల, దేవునితండా, మల్యాల, చందుర్తి, తిమ్మాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

## భద్రతా భావాన్ని కలిగించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

కోనరావుపేట: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల, నిజామాబాద్, బావుసాయిపేట, నిమ్మపల్లి, కోనరావుపేట, మల్కపేట గ్రామాల్లోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గురువారం తనిఖీ చేశారు. భద్రత చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు, మౌలిక వసతులను ముందుగానే చూసుకోవాలన్నారు. అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో వీలైనంత ఎక్కువసార్లు ఫ్లాగ్‌మార్చ్, రూట్‌మార్చ్, వాహనాల తనిఖీ చేపట్టి ఓటర్లకు భద్రత భావాన్ని కలిగించాలని సూచించారు. అనంతరం కోనరావుపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న సమయంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు.

## కరెంటు కావాలంటే బీఆర్ఎస్‌నే గెలిపించాలి

- ప్రజాసంక్షేమమే ధ్యేయం
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ/వేములవాడరూరల్/రుద్రంగి: మనకు కరెంటు కావాలంటే బీఆర్ఎస్‌కే ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసి మన రాష్ట్రాన్ని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరచుకుందామని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని నూకలమర్రి, పోచెట్టిపల్లి గ్రామాల్లో గురువారం ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌తో కలసి ప్రచారం చేశారు. గ్యారంటీల పేరుతో వచ్చే పార్టీలను నమ్మి మోసపోవద్దన్నారు. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. వేములవాడను మరింత అభివృద్ధి పరిచేందుకే తాను ఈ ప్రాంతానికొచ్చానని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఏశ తిరుపతి, సర్పంచ్‌లు పెండ్యాల తిరుపతి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**తండ్రి గెలుపు కోసం తనయ ప్రచారం**

బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు తనయ నిహారిక గురువారం వేములవాడ మండలం మర్రిపల్లి, రుద్రంగి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ మహిళలు, యువతులను కలుస్తూ మానాన్నకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వేములవాడ ఎమ్మెల్యేగా లక్ష్మీనర్సింహారావును గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రతీ పేదకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. మళ్లీ ప్రభుత్వం రావాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఆమె వెంట మర్రిపల్లి సర్పంచ్ కట్కం మల్లేశం, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ గంగారాం, కోఆప్షన్ మెంబర్ జెమీలా బేగం, నాయకులు గంగం మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



తండ్రి చల్మెడ లక్ష్మీనర్సింహారావు గెలుపునకు ప్రచారం చేస్తున్న తనయ నిహారిక

**సుద్దాలలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

కోనరావుపేట: మండలం సుద్దాలలో నేరెళ్ల జ్యోతి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. అభివృద్ధి పనులను వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు.

### భవిష్యత్ బాగుండాలంటే కారు గుర్తు మర్చిపోవద్దు

వేములవాడరూరల్: భావితరాల భవిష్యత్ బాగుండాలంటే కారు గుర్తుకు ఓటేసి చల్మెడను గెలిపించుకోవాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని పోచెట్టిపల్లి, నూకలమర్రి గ్రామాల్లో గురువారం రాత్రి అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమని, వీటిని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, సర్పంచ్‌లు ఏశ తిరుపతి, గొస్కుల రవి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, కట్కం మల్లేశం, పెండ్యాల తిరుపతి, టంపుల సుమన్, బాల్‌రెడ్డి, గడ్డం హన్మాండ్లు, గోపు బాలరాజు, పిట్టల వెంకటేశ్, సోమినేని బాలు తదితరులు పాల్గొన్నారు.

## సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మర్రిగడ్డలో ప్రచారం చేస్తున్న వికాస్‌రావు

చందుర్తి(వేములవాడ): నిస్వార్థంతో సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని.. ఎలాంటి మచ్చలేని నాయకునిగా ప్రజలందరూ ఆదరించి పువ్వు గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం చందుర్తి మండలం ఎన్గల్, బండపల్లి, మర్రిగడ్డ, లింగంపేట, ననుగుల, దేవునితండా, రామరావుపల్లె, కిష్టంపేట, జోగాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని మంత్రి కేటీఆర్ మాటలే చెబుతున్నాయని, వేములవాడను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ప్రకటించారని, పదేళ్లకు గుర్తుకు రాని అభివృద్ధి ఎన్నికలకు ముందు ఓట్లు రాజకీయంగా గుర్తించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో మంత్రి కేటీఆర్ నియోజకవర్గం, సిరిసిల్ల, సీఎం కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్, మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటలను అభివృద్ధి చేసుకున్నారని విమర్శించారు. ప్రచారంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు అల్లాడి రమేశ్, జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పొంచెట్టి రాకేశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి విజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఒక్కసారి గెలిపిస్తే.. ఐదేళ్లు మిమ్మల్ని గెలిపిస్తా**

రుద్రంగి: ఒక్కసారి నన్ను గెలిపిస్తే నిస్వార్థంగా పరిపాలన సాగిస్తూ ఐదేళ్లు మీకు సేవ చేస్తూ మిమ్మల్ని గెలిపిస్తానని వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఇందిరా చౌక్ వరకు ర్యాలీ తీశారు. అభ్యర్థిగా మొదటిసారి రుద్రంగికి వచ్చిన వికాస్‌రావుకు గ్రామ ప్రజలు, మహిళలు డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలు, మంగళహారతులు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వికాస్‌రావు మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరు గాంచిన రాజన్నను దత్తత తీసుకునే వారు ఇంకా పుట్టలేరని, వికాశ్‌రావును గెలిపిస్తే వేములవాడనే ఇతర నియోజకవర్గాలను దత్తత తీసుకునే స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. ఇదివరకే ఉచిత వైద్య శిబిరాలు పెట్టి నిరుపేదలకు ఉచిత వైద్యం అందజేశామని, ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. రాజకీయాలల్లోకి స్వార్థం కోసం రాలేదని ప్రజలకు సేవ చేయాలని వచ్చానని, నా కోసం రాలేదు మీ కోసం వచ్చానని అన్నారు. నాపైన అవినీతి ఆరోపణలు లేవని, ఇతరుల లాగా భూకబ్జాలు లేవని తెలిపారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, మాజీ సెస్ డైరెక్టర్ అల్లాడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం**

కొలనూర్, మర్తనపేట, ధర్మారం గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, నాయకులు గొట్టె రామచంద్రం, బైరగోని సురేశ్, మిర్యాల్‌కార్ బాలాజీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



రాపెల్లి లావణ్య శ్రీధర్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రతాప రామకృష్ణ, వికాస్‌రావు

**బీజేపీలో చేరిన మాజీ కౌన్సిలర్ రాపెల్లి లావణ్యశ్రీధర్**

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ రాపెల్లి లావణ్యశ్రీధర్‌లు గురువారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్టీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావులు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా, పార్టీ సభ్యత్వానికి రాజీనామా సమర్పించినట్లు తెలిపారు. నాయకులు కుమ్మరి శంకర్, రేగుల మల్లికార్జున్, సంటి మహేశ్, అన్నారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నాలుగు కిలోల కణతి తొలగింపు



మహిళ కడుపులోంచి తీసిన కణతి

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన దాసరి రాధ కడుపులో నుంచి నాలుగు కిలోల కణతిని డాక్టర్ హారిక గురువారం తొలగించారు. రాధ కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ వేములవాడలోని నందిని ప్రైవేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుంది. కడుపులో కణతి ఉందని చెప్పడంతో ఆపరేషన్ చేసి తొలగించాలని సూచించారు. ఆమేరకు ఆపరేషన్ చేసి కణతిని తొలగించారు.

### 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాలు ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం నామాపూర్ తండా, గోపాల్‌పల్లె, ఇందిరమ్మ కాలనీల్లో గురువారం దాడులు నిర్వహించి 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకంను ధ్వంసం చేసి 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాధ్యులైన భూక్య లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై శైలజ, శంకర్, సుమన్, రాకేశ్, రాజు తదితరులు పాల్గొన్నారన్నారు.

### అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



రాజయ్య(ఫైల్)

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం ఎంచుకున్న గల్ఫ్‌బాటలో అప్పుల పాలై, వాటిని తీర్చే దారిలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి, ఐదు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం పిట్ల రాజయ్య(55) అనే వ్యక్తి తనువు చాలించారు. ఈ సంఘటన చందుర్తి మండలం మల్యాల గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలకు చెందిన పిట్ల రాజయ్య ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. కంపెనీలో పని లేక తిరిగి రెండు సంవత్సరాలకే స్వగ్రామానికి చేరుకున్నాడు. గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీరక పోవడంతో వాటిని చెల్లించే స్తోమత లేక ఈనెల 11న పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్ప, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న రాజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. కాగా మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# నల్లకోటు వీడి.. చట్టసభల్లోకి



## ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నికైన న్యాయవాదులు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 మంది
- వీరిలో పలువురిని వరించిన మంత్రి పదవి
- భారత ప్రధాని పీవీ నర్సింహారావు లాయరే..
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు కూడా..



పీవీ నర్సింహారావు, శ్రీపాదరావు, టి.జీవన్‌రెడ్డి, వినోద్‌కుమార్, విద్యాసాగర్‌రావు, ప్రభాకర్‌గౌడ్, ఆరెపల్లి మోహన్



రాజేశంగౌడ్, ఎమ్మెస్సార్, బొమ్మ వెంకన్న, మృత్యుంజయం, సి.ఆనందరావు, రాజేశ్వర్‌రావు, డి.శ్రీధర్‌బాబు

సిరిసిల్ల: న్యాయశాస్త్రం చదువుకున్న పలువురు న్యాయవాద వృత్తిని వీడి, చట్టసభల్లో అడుగు పెట్టారు. రాజకీయాల్లో అతిరథమహారథులుగా పేరొందిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు వకీళ్లుగా కోర్టుల్లో నల్లకోటు వేసినవారే. భారత ప్రధానిగా సేవలందించిన బహుభాషావేత్త పీవీ నర్సింహరావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు కూడా న్యాయవాదులే. ఇలా ఉమ్మడి జిల్లాలో ఏకంగా 30 మంది ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వకీల్‌గా జీవితాన్ని ప్రారంభించి, ప్రజాప్రతినిధిగా ఎన్నికైనవారిపై కథనం.

**తొలి ఎన్నికల్లోనే..**

ఉమ్మడి జిల్లాలో 1952లో తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది ఏలేటి రాజిరెడ్డి సుల్తానాబాద్ నుంచి విజయం సాధించారు. మంథని నుంచి సోషలిస్టు అభ్యర్థి గుల్లకోట శ్రీరాములు, సిరిసిల్ల నుంచి జె.ఆనందరావు(పీడీఎఫ్) గెలిచారు. 1957లో సుల్తానాబాద్ నుంచి పి.రామచంద్రారావు(పీడీఎఫ్), చొప్పదండి నుంచి చెన్నమనేని రాజేశ్వర్‌రావు(పీడీఎఫ్), మెట్‌పల్లి నుంచి జె.ఆనందరావు(పీడీఎఫ్) ఎన్నికయ్యారు. 1957లోనే మంథని నుంచి గెలిచిన పీవీ నర్సింహారావు మూడుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన సేవలందించారు. హైదరాబాద్‌లో ఆయన మొదట్లో న్యాయవాదిగా ఉన్నారు.

**రాష్ట్ర మంత్రులైనవారు వీరే..**

న్యాయవాదిగా పని చేసిన పలువురు ఎమ్మెల్యేలుగా గెలిచి, రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. కరీంనగర్ నుంచి ఎన్నికైన చల్మెడ ఆనందరావు ఎన్టీఆర్ మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు. జగిత్యాల నుంచి గెలిచిన జి.రాజేశంగౌడ్, 1987లో ఎమ్మెల్యే అయిన టి.జీవన్‌రెడ్డి, 2004లో కరీంనగర్ నుంచి గెలిచిన ఎం.సత్యనారాయణరావు, మంథని ఎమ్మెల్యేగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను మంత్రి పదవి వరించింది.

1985లో మెట్‌పల్లి నుంచి విజయం సాధించిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు న్యాయవాద వృత్తి చేపట్టినవారే. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేశారు.

**స్పీకర్‌గా శ్రీపాదరావు..**

న్యాయవాద వృత్తి నుంచి వచ్చినవారిలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రముఖుడు. 1983, 1985, 1989 ఎన్నికల్లో గెలిచిన ఆయన శాసనసభ స్పీకర్‌గా ఎక్కువ కాలం పని చేశారు. ఆయన కుమారుడు శ్రీధర్‌బాబు కూడా లాయరే. 1999, 2004, 2009, 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగానూ సేవలందించారు.

జంగ్ తెలంగాణ

**మరికొందరు..**

1963లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన కాసుగంటి లక్ష్మీనర్సింహారావు న్యాయవాదిగా పని చేశారు. 1967 ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికై, రికార్డు సృష్టించారు. 1985లో నేరెళ్ల నుంచి గెలిచిన ఉప్పరి సాంబయ్య, 1983లో కరీంనగర్ స్థానం నుంచి సంజయ్ విచార్‌మంచ్ అభ్యర్థిగా గెలిచిన కటకం మృత్యుంజయం, 1989లో హుజురాబాద్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన కె.సాయిరెడ్డి, 1994లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన జువ్వాడి చంద్రశేఖర్‌రావు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇందుర్తిలో విజయం సాధించిన బొమ్మ వెంకటేశ్వర్లు, 1999లో మెట్‌పల్లి నుంచి గెలిచిన కొమొరెడ్డి జ్యోతి, 2004లో ఎన్నికైన కొమొరెడ్డి రామ్‌లు, 2009లో మానకొండూరు నుంచి గెలిచిన ఆరెపల్లి మోహన్, 2009లో కరీంనగర్ నుంచి ఎంపీగా విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు న్యాయశాస్త్రం చదివినవారే కావడం విశేషం. నల్లకోటు వీడి ఎన్నికల బరిలో నిలిచిన పలువురు విజయం సాధించగా ఎంతోమంది న్యాయవాదులు ఓటమిపాలయ్యారు. చట్టసభల్లో సక్సెస్ అయిన నేతలెందరో ఉమ్మడి జిల్లాకు మంచిపేరు తీసుకువచ్చారు.

# లీడర్లకు తప్పని ఇంటి పోరు

- పొద్దున పోతే రాత్రయ్యాకే ఇంటికి..
- నిత్యం కుటుంబంలో గొడవ
- ఎన్నికల ప్రచారం నేపథ్యంలో చోటామోటా నాయకుల తిప్పలు

కోరుట్ల: పొద్దుగాల.. ఏడు గంటల సమయం. ఊరి చోటా లీడర్ గంగాధర్ ఫోన్ ట్రింగ్.. ట్రింగ్ అని మోగుతోంది. రాత్రి ఇంటికి లేటుగా వచ్చిన అతను అబ్బా.. అని మత్తు వదిలించుకుంటూ మంచం మీద నుంచి లేచి ఫోన్ ఎత్తాడు. అన్నా ఇగో.. రెండు నిమిషాల్లో వస్తున్నా.. హోటల్ కాడ ఉండుండ్రి.. అని చెప్పి, పెట్టేసిండో లేదో.. ఇంటి పోరు మొదలైంది. గంగాధర్ భార్య లక్ష్మి ఒక్కసారిగా మాటల జోరు పెంచింది. అది హోరుగా మారింది. ఇంతకీ ఆ ఇంటి మహాలక్ష్మి మాటల జోరేంది.. ఆ ముచ్చటేంది.. ఓసారి తెలుసుకుందాం.

- లక్ష్మి: అనుకున్న.. ఇయ్యాల ఆ దరిద్రపు ఫోన్ ఇంకా వస్తలేదని.. రానే వచ్చింది. ఇగ ఇప్పుడు పోతే.. ఏ వేళకు ఇంటికి వస్తవో?

గంగాధర్: అవ్.. లక్ష్మి.. మా పార్టీ పెద్ద మనిషి ఫోన్ చేసిండు. ఇయ్యాల మన పక్క ఊరిలో ప్రచారమట. ఏడు వరకే ఉండమన్నడు.. నువ్ పొద్దున్నే లేపొద్దా?

- లక్ష్మి: గీ ఫోన్.. పదిహేను రోజుల నుంచి గిట్లనే వస్తుంది. పొద్దుగాల ఏడు కావాల.. ఎవరో ఒకరు ఫోన్ చెయ్యాల.. పార్టీ మీటింగ్‌లు.. ప్రచారం అనుకుంట నువ్ పొద్దుమాపు తిరిగి అర్ధరాత్రి వేళ ఇంటికి రావాలె..

గంగాధర్: మరి ఏందనుకున్నవే లీడర్ అంటే.. మా పార్టీ పెద్ద మనిషికి నేను లేకుంటే నడ్వదు. అన్ని ఊళ్లకు నన్నే పిలుస్తడు. ఈసారి ఆయన ఎంబడి ఉండి, గట్టిగా తిరిగి ఎట్లన్న జేసి, పార్టీని గెలిపించుకోవాలె.

- లక్ష్మి: అవ్ మల్ల. మీ పార్టీని గెలిపించుకోవడానికి మస్తు తిరుగుతున్నవ్. కానీ ఇంటి సంగతేంది. ఇంట్ల ఏమన్న ఉన్నదా.. లేదా చూసుకోవాల్నా.. లేదా?

గంగాధర్: అగో.. మొన్ననే ఇంట్లకు అన్ని తెచ్చిపెడితిని కదా.. ఇంకేం కావాలా.. ఎప్పుడు గిదే లొల్లి.. ఏం పనిచేసుకోనియ్యవ్.

- లక్ష్మి: మొన్న తెచ్చినవా? ఎన్ని రోజులవుతుందో.. ఏమన్నా కాల్లి ఉన్నదా నీకు? పొద్దుగాల లేసి పార్టీ.. పార్టీ అనుకుంట పోతున్నవ్. ఇంటి సామాన్లు తెచ్చి, ఇరవై రోజులైంది. అప్పటి నుంచి ఏం పట్టించుకుంటలేవ్.. నేను ఎట్ల ఎల్లదియ్యాలె?

గంగాధర్: అరే.. గిదేం లొల్లి మోపుజేసినవే? ఆడ మా పార్టీ గెలుస్తదా.. లేదా అని మేం పరేషాన్‌లో ఉన్నం.. నువ్వేమో గిట్ల తలిగినవ్.

- లక్ష్మి: అవ్ మరి.. పదిహేను రోజుల నుంచి పొద్దుగాల లేచి టిఫిన్ కాడికెళ్లి బిర్యానీ దాకా బయట తిని, రాత్రి పూట మంచిగ తాగి వస్తున్నవ్.. నీకేం తెలుస్తయ్ ఇంట్ల నా తిప్పలు. బడి సారు చిన్నపోరని ఫీజు పైసలు కట్టమని అడిగితే పక్కింటి సరోజను అడిగి తెచ్చి, కట్టిన. పెద్ద పిల్ల బడిలో టూర్ పోతున్నరని 2 వేలు కావాలని చెప్పింది. ఇంట్లో కిరాణా సామాను అయిపోయింది. గివన్నీ జెప్తమంటే.. పొద్దుగాల్నే ఫోన్ రావట్టే.. బిర బిర ఉర్కవడితివి.

గంగాధర్: సరేగానీ అవన్నీ నేను చూసుకుంట.. మా సారు గెలుస్తే గీ తిప్పలే ఉండవ్.. జల్దీ చాయ్ పెట్టు. నేను పోవాలా.. మీటింగ్‌కు లేటవుతుంది.. నా కోసం కారు ఆపిండ్రు.

- లక్ష్మి: చాయ్ పెట్టాల్నా.. ఎట్ల పెట్టాలె? పాల నారాయణ పైసలు ఇవ్వలేదని పాలు పోసుడు బంజేసిండు. చాపత్త లేదు. చెక్కరి అయిపోయింది. పో.. పో అక్కడ నీ కోసం చూస్తున్నరు కదా. వాళ్లే నీకు చాయ్, మందు అన్నీ పోస్తరు. నేను ఎట్లనో బాకీలు చేసి, తిప్పలు వడ్త.
- 'సరే.. సరేలే.. నేను ఇయ్యాల జల్దీ వస్తా.. అన్నీ తెస్తా.. అని చెప్పుకుంట గంగాధర్ బండి తీసుకొని ఇంట్లకెల్లి, బయటవడ్డడు.
- నిజంగా జల్దీ వస్తడంటారా? ఎన్నికలు ముగిసేదాకా ఇల్లూవాకిలి పట్టించుకోకుండా గిట్లనే తిరుగుతడా.. అనేది మనకు బేతాళ ప్రశ్న. ఇదీ ఎన్నికల సమయంలో చోటామోటా లీడర్ల ఇళ్లల్లోని ఇంటి పోరు తీరు.

# తాగుడు లేకపాయె.. లొల్లి తక్కువాయె

- బెల్టుషాపులు, గుడుంబా విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం
- మందుబాబుల జోరుకు అడ్డుకట్ట
- పల్లెల్లో ప్రశాంత వాతావరణం

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర ప డుతోంది. పోలీసులు, అబ్కారీశాఖ అధికారులు గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. బెల్టుషాపులు, గుడుంబా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు, బెల్టుషాపుల నిర్వహకుల ను గుర్తించి, ముందస్తుగా బైండోవర్ చేస్తున్నారు. బైండోవర్ చేసిన తర్వాత కూడా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తున్నారు. ఫలితంగా పల్లెల్లో మందుబాబుల జోరు తగ్గి, ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఈ పరిణామాలపై ఓ గ్రామంలో రాజక్క, రాణక్క అనే ఇద్దరు మహిళలు ఇలా సంభాషించుకున్నారు.

- రాజక్క: ఏం రాణక్కా.. బాగున్నవా?

రాణక్క: ఆ.. ఇప్పుడు ప్రశాంతంగా ఉంటున్న.

- రాజక్క: ఎందుకు? ఇన్ని రోజుల నుంచి లేవా ఏంది?

రాణక్క: ఆ.. ఏం ప్రశాంతత.. నా పెనిమిటి పొద్దంతా కూలీకెళ్లి, రోజూ సాయంత్రం తప్పతాగచ్చి, ఒకటే లొల్లి చేసేవాడు. గీ ఎన్నికల పుణ్యమాని ఊల్లె మందు దుకాణాలను మొన్నటి నుంచి పోలీసోల్లు బందు చేయించుండ్రు. ఇగ, నా పెనివిటి తాగుడు తగ్గించిండు. లొల్లి గూడా తక్కువైంది.

- రాజక్క: అవును.. మా ఊల్లె గూడా గీ మందు దుకాణాలు తీత్తలేరు. ఎందుకో అనుకున్న.

రాణక్క: ఇది ఎలచ్చన్ల సమయం. గిప్పుడు పాలనంత గా ఎన్నికల సంఘమొల్ల చేతిలో ఉందట. గీ నాయకులు చెప్పినవి ఇనరట. గా ఎన్నికల సంఘం అధికారులు చెప్పడంతో పోలీసోల్లు అబ్కారీ సార్లు ఊర్లల్ల మందు దుకాణాలను చెకింగ్ చేస్తున్నరు. కల్లు అమ్మద్దని చెప్తండ్రు. అమ్మితే జైళ్లవెడ్తరట.

- రాజక్క: గదా సంగతి.. మా ఊల్లె ఇంతకుముందు ఇంటికో దుకాణంలో కల్లు అమ్మేటోళ్లు. అందరు తాగేటోళ్లు. లొల్లులు పెట్టుకునేటోళ్లు. గిప్పుడు గా దుకాణాల్లో కల్లు అమ్ముతలేరు. ఎవరూ అత్తలేరు. లొల్లులు లేక ఊరు సల్లగుంది. ఎప్పుడు గిట్లనే ఉంటే మంచిగుండు.

రాణక్క: ఎప్పుడు గిట్లుంటే గా అధికారులకు ముల్లె లెట్ల వస్తయి. గీ ఎలచ్చన్ల వరకే గిట్లుంటదట. కొత్త సర్కారు వచ్చినంక మల్ల అందరు మొదట్లెక్కనే అమ్ముకుంటరట.

- రాజక్క: అయితే ఎప్పటికి గీ ఎన్నికల సంఘమే పాలిస్తె మంచిగుండు. ఇప్పుడే మంచిగుంది.

రాణక్క: గట్లెట్ల కుదుర్తది. మనది ప్రజాస్వామ్య దేశం. మన పాలకులను మనమే ఎన్నుకోవాలె.

- రాజక్క: మరి గెలిచినంక గీ పాలకులు కూడి గిట్ల చెయ్యచ్చు కదా?

రాణక్క: గట్ల చేస్తే సర్కారుకు ఆదాయం ఎట్లస్తది? మనోళ్లు తాగుబోతులుగా మారాలె. ఆరోగ్యం చెడిపోవాలె. కుటుంబాలు ఆగం కావాలె. మనోళ్లు తాగితే వచ్చే పైసలతో అభివృద్ధి పేరిట ఆళ్ల జేబులు నింపుకోవాలె.

- రాజక్క: అలాంటోళ్లకు మనమెందుకు ఓటెయ్యాలె?

రాణక్క: గందుకే కల్లు పోస్తమని, పైసలిస్తమని అచ్చేటోళ్లను తరిమికొట్టాలె. మంచొళ్లనే గెలిపియ్యాలె.

# ఓటర్లను మభ్యపెడితే కఠినచర్యలు

- డీఎస్పీ వెంకటస్వామి



లక్ష్మీదేవిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

సారంగాపూర్: ఓటర్లను మభ్యపెట్టి, తాయిళాలు ఇచ్చి, ఓటు వేయించేందుకు ప్రయత్నిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటస్వామి హెచ్చరించారు. సారంగాపూర్ మండలంలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ.. ఎవరైనా ఎన్నికల నియమావళిని ధిక్కరించేలా వ్యవహరిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఓటర్లకు మద్యం, డబ్బులు, వస్తువులు పంపిణీ చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో నగదు, ఇతర వస్తువులను తీసుకెళ్తే సంబంధిత పత్రాలు చూపించాలన్నారు. లేకపోతే వాటిని సీజ్ చేసి, ఎన్నికల టీంకు అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట సారంగాపూర్ ఎస్‌ఐ తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు కార్డుల ఫ్లెక్సీలు



రకాల గుర్తింపు కార్డుల పేర్లతో ఉన్న ఫ్లెక్సీ

జగిత్యాల: జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు ధ్రువీకరణకు సంబంధించిన 13 రకాల గుర్తింపు కార్డుల పేర్లతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే ప్రతిఒక్కరూ తమకు ఏ కార్డు ఉన్నా ఓటు వేయవచ్చని అర్థమయ్యేలా వీటిని తయారు చేయించారు.

## వ్యాసరచన పోటీలు



వైష్ణవిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

రామడుగు(చొప్పదండి): గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వారు సాంఘీకశాస్త్రం సబ్జెక్టుపై గురువారం కరీంనగర్‌లో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రామడుగు మండలంలోని రుద్రారం హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని గోనె వైష్ణవి ప్రతిభ కనబరిచి, నాలుగో స్థానంలో నిలిచింది. ఆమెను డీఈవో జనార్దన్‌రావు అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో ప్రతిభ



సాహిత్య

రాయికల్(జగిత్యాల): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాహిత్య రాష్ట్రస్థాయి కళోత్సవ పోటీల్లో స్వదేశీ బొమ్మల తయారీ విభాగంలో తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి గురువారం తెలిపారు.



# వందశాతం పోలింగ్‌కు చర్యలు

- గతంలో తక్కువ శాతం నమోదైన ప్రాంతాలపై దృష్టి
- ఈసారి ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు
- జిల్లాలో 785 పోలింగ్ కేంద్రాలు



ఈవీఎంలపై అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు

జగిత్యాల: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సంఘం 2018 ఎన్నికల్లో ఈవీఎంలకు వీవీపాట్‌లను ఏర్పాటు చేసి, ఓటరు ఏ గుర్తుకు ఓటు వేశారో తెలుసుకునే అవకాశం కల్పించింది. ఈసారి గుర్తుతోపాటు, అభ్యర్థి ఫొటోను ముద్రించింది. దీనివల్ల ఓటర్లు తాను ఎవరికి ఓటు వేశామో చూసుకునే వీలు కలుగుతుంది. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి యాస్మిన్ బాషా కోరారు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలున్నాయి. మొత్తం 785 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**నియోజవర్గానికి 5 ప్రత్యేక కేంద్రాలు..**

ఈసారి వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో జిల్లాలోని ఏయే ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ నమోదైందో వివరాలు సేకరించారు. మై ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ద్వారా కొత్త ఓటు నమోదు చేసుకోవడంతోపాటు ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు. అలాగే, మోడల్, ఆదర్శ, యువత, మహిళలు, దివ్యాంగుల కోసం నియోజకవర్గానికి 5 చొప్పున ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో అక్రమాలపై సీ–విజిల్ యాప్‌లో ఫొటో, వీడియోలతో ఫిర్యాదు చేస్తే నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి చేరుతాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలే వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి, చర్యలు తీసుకుంటాయి.

**పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు 1586 మంది**

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేసేవారు 1586 మంది ఉన్నారు. గతంలో ఎన్నికల విధుల ఉద్యోగులు, అధికారులు ఎన్నికల విధులకు హాజరయ్యే ముందు ఓటు వేసేవారు. కానీ ఈసారి పోలింగ్ ప్రారంభానికి ముందే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన





బతికపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐ, సిరికొండలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కథలాపూర్: మండలంలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ గురువారం పరి శీలించారు. సిరికొండ, కథలాపూర్, తాండ్ర్యాల, చింతకుంట, తక్కళ్లపెల్లి గ్రామాల్లో పర్యటించారు. పోలింగ్ రోజు వివాదాలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**వసతుల కల్పనపై ఆరా..**

పెగడపల్లి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్‌బీ డీఎస్పీ, ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి కె.రవీంద్ర కుమార్ అన్నారు. పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్‌ఐ సతీశ్‌తో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఘర్షణ పడటం, ఉద్రిక్తత చోటు చేసుకున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఈసారి ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# గుండెపోటుతో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి



ప్రదీప్తి (ఫైల్)

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని గెంట్యాల ప్రదీప్తి(18) గురువారం గుండెపోటుతో మృతి చెందింది. ప్రదీప్తి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం కాలేజీలో హఠాత్తుగా గుండెపోటుకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించింది. ప్రదీప్తి హఠాన్మరణంతో ఆమె తల్లిదండ్రులు గెంట్యాల రేణుక-భూమేశ్‌లు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రదీప్తి మృతదేహాన్ని అంబులెన్స్‌లో సిరిసిల్లలోని స్వగృహానికి తరలించారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. చిన్న వయసులోనే ఇంజినీరింగ్ విద్యార్థిని గుండెపోటుతో మరణించడం సిరిసిల్లలో విషాదం నింపింది.

# కువైట్‌లో అనంతపల్లి వాసి మృతి



గంగాధర్‌గౌడ్(ఫైల్)

చందుర్తి (వేములవాడ): జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ యువకుడిని విధి గుండెపోటు రూపంలో బలి తీసుకుంది. ఈ సంఘటన చందుర్తి మండలం అనంతపల్లి గ్రామంలో గురువారం విషాదాన్ని నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అనంతపల్లి గ్రామానికి చెందిన బుర్ర గంగాధర్‌గౌడ్(44) ఉపాధి కోసం మూడేళ్ల క్రితం కువైట్ వెళ్లాడు. అక్కడ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి రెండు నెల క్రితం మళ్లీ కువైట్‌కు వెళ్లాడు. బుధవారం తాను పనిచేస్తున్న సమయంలోనే గుండెనొప్పి రావడంతో అతడి స్నేహితులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఫోన్ ద్వారా మృతుడి బంధువులకు సమాచారం అందింది. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు మనివర్ధన్, కూతురు మణిదీప్తిలు ఉన్నారు.